క్లుప్తంగా

శాలిపేటలో ఫీవర్ సర్వే



శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సాయిసింధు, వైద్య సిబ్బంది తదితరులు

చిన్నశంకరంపేట(మెదక్): జ్వరంతో బాధపడు తున్న వారిని గుర్తించి స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రాపిడ్ టెస్ట్ నిర్వహిస్తు న్నట్లు చిన్నశంకరంపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు తెలిపారు. శుక్రవారం మండలంలోని శాలిపేటలో మూడు బృం దాలుగా వైద్య సిబ్బంది ఫీవర్ నిర్వహిస్తు న్నారు. ఇప్పటి వరకు 209 ఇళ్లను సందర్శిం చామని తెలిపారు. ప్రతి ఒక్కరికి పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరిస్తున్నామని చెప్పారు. ప్రతి శుక్ర వారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హృదయ్, సీహెచ్ఓ యాదగిరిరావు, ల్యాబ్ టెక్నిషియన్ నర్సిం హులు, ఏఎన్ఎం స్వప్న, ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పోస్ట్‌మెన్ మాకొద్దు



ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు, పెన్షనర్లు

– లింగాపూర్ గ్రామస్తుల ఆందోళన

నర్సాపూర్ రూరల్: విధులపై నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్న పోస్ట్‌మెన్ మాకు వద్దంటూ నర్సా పూర్ మండలం లింగాపూర్ గ్రామస్తులు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఉపాధి హామీ కూలి డబ్బులు ఇవ్వడంలో పోస్టుమెన్ నిర్లక్ష్యంగా వివరిస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. దీంతో పాటు ప్రతినెలా వృద్ధులు, దివ్యాంగులు వితం తువులు, ఒంటరి మహిళల పెన్షన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విష యమై ఎస్‌పీఎం హరి ప్రసాద్‌ను వివరణ త్వరగా ఉపాధి కూలీలకు సంబంధించి పోస్ట్ ఆఫీస్ నుంచి కొత్త పాస్ బుక్ లు తీసుకోక పోవడంతో కొంత ఇబ్బంది జరుగుతున్న మాట వాస్తవమే అన్నారు. కొత్త పాస్‌బుక్‌లు తీసుకుంటే ఇలాంటి సమస్య ఉండదని తెలి పారు. పెన్షన్ల పంపిణీలో ఎలాంటి సమస్య లేదన్నారు.

రుణమాఫీ కోసం 242 దరఖాస్తులు



నార్సింగి రైతు వేదికలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ యాదగిరి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం లో రుణమాఫీ కాని రైతుల నుంచి ఇప్పటి వరకు 242 మంది దరఖాస్తులు అందినట్లు వ్యవసాయ అధికారి యాదగిరి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాల్సినవి 49, ప్రాసె స్‌లో ఉన్నవి103, డేటా లేనివి 04, ఆధార్, బ్యాంక్ ఖాతాలో పేరు మార్పులు-20, అసలు కంటే వడ్డీ ఎక్కువ-05, పట్టాపాస్‌బుక్‌లో తేడాలు-8, డబ్బులు వాపసు పోయినవి-2, ఇతర కారణాలు-1 ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన వివరించారు. సమస్యలున్న రైతులు వెంటనే దరఖాస్తులు అందించాలని కోరారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

రేగోడ్(మెదక్): అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావు అన్నారు. మం డల కేంద్రమైన రేగోడ్‌లో శుక్రవారం 45 మం ది లబ్ధిదారులకు సీఎంఆర్ పథకం ద్వారా మంజూరైన రూ.13 లక్షల 22 వేల 500ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, మాజీ సర్పంచ్ విజయ భాస్కర్, మాజీ ఎంపిటిసి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్ది పేట కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని విక్టరీ, బస్టాండ్ చౌరస్తాలు, ఎంపీడీఓ కార్యా లయ చౌరస్తాతోపాటు పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో ఆరుగురు మద్యం తాగి వాహనాలు నడు పుతూ పట్టుబడ్డారు. శుక్రవారం విచారణ జరి పిన న్యాయమూర్తి రూ.9,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

డబుల్.. ట్రబుల్

- ఏడాదిగా నిలిచిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు
- పెండింగ్‌లో రూ. 2 కోట్ల బిల్లులు
- పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లు



స్లాబ్ స్థాయిలో నిలిచిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు

నర్సాపూర్: గత ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసేం దుకు నిర్మించ తలపెట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు ఏడాదిగా నిలిచిపోయాయి. ఆరేళ్లు గడుస్తున్నా కొన్ని బ్లాక్‌లు స్లాబ్‌ల స్థాయిలోనే అసం పూర్తిగానే ఉన్నాయి. గత ప్రభుత్వం నర్సాపూర్ పట్టణానికి ఐదు వందల డబుల్ బెడ్రూం ఇళ్లు చేయగా, వాటిని రెండు విభాగాలుగా విభజించి సుమారు ఆరేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎదురుగా 252, మార్కెట్ కమిటీకి వెనుక భాగంలో 248 ఇళ్లను నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేసి రెండు సం స్థలకు పనులు అప్పగించారు.

స్లాబ్ స్థాయిలోనే పలు బ్లాక్‌లు

మార్కెట్ కమిటీ వెనుక భాగాన నిర్మిస్తున్న ఇళ్ల పనులు ముందుకుసాగడం లేదు. పలు బ్లాక్‌లు రెం డంతస్తుల వరకు పూర్తి చేసి గోడల నిర్మాణం పూర్తి చేయగా, కొన్ని బ్లాక్‌లు గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ స్థాయిలో, కొన్ని మొదటి అంతస్తు స్లాబ్ స్థాయి లోనే ఉన్నాయి. కాగా మార్కెట్ కమిటీ ముందు భాగాన నిర్మించిన ఇళ్ల భవనాలు పూర్తి చేసి వాటికి పెయింటింగ్ సైతం వేసినప్పటికీ ఫ్లోరింగ్, కరెంట్ వైరింగ్, ప్లంబర్ పనులు చేపట్టాల్సి ఉంది.

బిల్లులు రాకపోవడంతోనే..

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసిన మేరకు రెండు సంస్థలకు ప్రభుత్వం నుంచి సుమారు రూ. 2 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని తెలిసింది. బిల్లులు రాకపోవడంతోనే పనులు నిలి పివేసినట్లు సమాచారం. కాగా సుమారు ఆరు నెలల క్రితం పలువురు జిల్లా అధికారులు ఇళ్ల పనులు పరిశీలించి బిల్లులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని, పనులు ప్రారంభిం చాలని కాంట్రాక్టర్లకు సూచించగా, బిల్లులు రాగానే పనులు ప్రారంభిస్తామని వారు చెప్పారు.

అయోమయంలో ప్రజలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డబుల్ బెడ్రూం ఇళ్ల పరిస్థితి ఏమిటనేది ప్రజల్లో అయోమయం నెలకొంది. ప్రభుత్వం డబుల్ బెడ్ రూం పథకానికి బదులుగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల పరిస్థితి ఏమిటనే సందేహం ప్రజల్లో నెలకొంది. ఇదిలా ఉండగా రెవెన్యూ శాఖ అధి కారులు గతంలో పట్టణంలో ఇళ్లు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. సుమారు మూడు వేల దరఖాస్తులు వచ్చాయి. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతు న్నారు. ఇదే విషయమై పీఆర్ డీఈఈ రాధిక లక్ష్మిని వివరణ కోరగా ఈ విషయం జిల్లా ఉన్నతాధికా రుల దృష్టిలో ఉందని తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. బిల్లులు రాగానే అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిం చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.



నర్సాపూర్: పిచ్చి మొక్కలు తొలగిస్తున్న అశోక్‌గౌడ్, తదితరులు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

నర్సాపూర్ : ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశో క్‌గౌడ్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ పంబాల లలితతో కలిసి వార్డులో పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించె పనులు ప్రారంభిం చారు. వార్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టడం పై కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం అధికారులు, వైద్య సిబ్బంది డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని తునికిలో ఏఎన్ఎం లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఆశా వర్కర్లు తిరిగి పాత టైర్లు, నీటితొ ట్లలో మురికి నీటని తొలగించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకుంటూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని చిలప్‌చెడ్ మండలం ప్రత్యేకాధికారి మాన్యనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్ గ్రామంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్, పంచాయతీ కార్య దర్శి నాగరాజు, అంగన్‌వాడీలు ఆశావర్కర్లు, తది తరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): వర్షాకాలాన్ని దృష్టి పెట్టుకొని గ్రామాల్లోని ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ రియాజొద్దీన్ సూచించారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంపీడీఓ రాయాజొద్దీన్‌తోపాటు స్థానిక వైద్యుడు డాక్టర్ హరి ప్రసాద్ గ్రామంలో పర్యటించి పరిశుభ్రతపై అవ గాహ కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యామల, పీహెచ్ఎన్ సుగుణాకర్, ఏఎన్ఎం జయప్రద, పం చాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాస్‌బుక్కు తనఖా లేకుండానే రుణాలు

- డీసీసీబీ మేనేజర్ కిషన్ జాదవ్



డీసీసీబీ మేనేజర్ కిషన్ జాదవ్

పాపన్నపేట (మెదక్). పట్టాదారు పాస్‌బుక్‌లు తనఖా లేకుండానే రైతులకు రుణాలు ఇస్తామని పాపన్నపేట డీసీసీబీ మేనేజర్ కిషన్ జాదవ్ ప్రక టించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లా డుతు రూ.1.60 లక్షల రుణం వరకు మోర్టిగేజ్ చేసు కోబోమన్నారు. కేవలం ధరణి చార్జి క్రియేషన్ చేసి రుణం ఇస్తామని చెప్పారు. అసైన్‌మెంట్ భూము లకు కూడా రుణాలు ఇస్తామని తెలిపారు. రైతు నేస్తం పథకం ద్వారా ఎకరానికి రూ.2 లక్షల రుణం ఇస్తామన్నారు. దీర్ఘకాలిక రుణాల కింద ఎకరానికి రూ.4 లక్షల చొప్పున పౌల్ట్రీ, డెయిరీ షిప్‌ఫామ్‌లకు రుణాలు ఇస్తామని ఆయన వివరించారు. తమ బ్యాంకు పరిధిలో రూ.5.50 కోట్ల రుణాలు మాఫీ కాగా, ఇప్పటి వరకు రూ.4.50 కోట్లు తిరిగి రుణాలుగా ఇచ్చామన్నారు. మిగతా రైతులు వెంటనే రుణాలు తీసుకోవాలని కోరారు. డిపాజిట్‌లపై ఇతర బ్యాం కుల కన్నా ఎక్కువ వడ్డీ ఇస్తామన్నారు. ఏడేళ్ల తర్వాత చీకోడ్ సొసైటీ పరిధిలో ఎల్‌టీ లోన్‌లు ఇచ్చి నట్లు చెప్పారు. ఆయన వెంట చీకోడ్ సొసైటీ చైర్మన్ దత్త రాజ్ ఉన్నారు.

పాడైపోయిన ట్రాఫిక్ సిగ్నల్స్



ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు

నర్సాపూర్ : ట్రాఫిక్ సిగ్నల్స్‌కు మరమ్మతులు చేయించిన వారం రోజులకే పాడైపోవడం గమనా ర్హం. జాతీయ రహదారిపై పట్టణంలోని చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ కొన్ని నెలల కిం దట పాడవడంతో ఇటీవల మరమ్మతులు చేయిం చారు. వారం రోజులకే మళ్లీ సిగ్నల్స్ ఆగిపోవడం తో నాణ్యత లేదని సర్వత్రా విమర్శలు వస్తు న్నాయి. సిగ్నల్స్ పని చేయకపోవడం, ట్రాఫిక్ కానిస్టేబుల్ లేకపోవడంతో వాహనదారులు ఇష్ట మొచ్చినట్లు వెళ్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మట్టి తరలిస్తున్న లారీల పట్టివేత



మట్టి టిప్పర్లు

చేగుంట(తూప్రాన్): అక్రమంగా మట్టిని తరలి స్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మాసాయిపేట మండలం బొమ్మారం శివా రులో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని బొమ్మారం శివారు నుంచి అక్రమంగా మట్టి తర లిస్తున్నట్లు సమాచారం అందడంతో బొమ్మారం సమీపంలోని గల్ఫ్ పరిశ్రమ సమీపంలో మట్టి నిం పుతున్న టిప్పర్లను పట్టుకున్నారు. తమ పొలం లోని మట్టిని తీస్తున్నట్లు మట్టి తరలిస్తున్న వ్యక్తులు పోలీసులకు తెలియజేసారు. మట్టి తరలింపు కోసం అనుమతులపై విచారణ నిమిత్తం టిప్పర్లను మాసాయిపేట రెవెన్యూ అధికారులకు అప్పగించి నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

వర్షాలకు కూలిన ఇల్లు



రాంపూర్‌లో వర్షాలకు కూలిన ఇల్లు

నిజాంపేట(మెదక్): గత రెండు, మూడు రోజులగా కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయింది. ఈ మేరకు నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన కేశవుల స్వామి ఇల్లు రెండు, మూడు రోజుల సాయంత్రం సమయంలో కురిసిన భారీ వర్షాలకు ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయం లో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. ఇంటిని పరిశీ లించి ఉన్నతాధికారులకు సమాచారం అం దిస్తామని తహసీల్దార్ తెలిపారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

చిన్నశంకరంపేట(మెదక్): రుణమాఫీకాని రైతుల నుంచి దరఖాస్తులను తీసుకుంటు న్నట్లు వ్యవసాయశాఖ అధికారి లక్ష్మిప్రవీణ్ తెలిపారు. ఐబీ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఉన్న రైతువేదికలో దరఖాస్తులు తీసుకుం టున్నట్లు చెప్పారు. రైతులు తమ కార్యాల యానికి వెళ్లకుండా రైతువేదిక వద్దకు రావాలని ఆయన కోరారు.

ఫిజియోథెరపీతో ఆరోగ్యం మెరుగు



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు

టేక్మాల్(మెదక్): అంగవైకల్య విద్యార్థులకు ఫిజియోథెరపీతోనే ఆరోగ్యం మెరుగు పడుతుందని డాక్టర్ మౌనిక తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన టేక్మాల్ వనరుల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫిజియోథెరఫీ పరీక్షలు నిర్వహించారు. అంగవైకల్యం గల విద్యా ర్థులకు మెడనొప్పులు, నరాల బలహీనత, ఎముకలు విరిగిన విద్యార్థులను పరీక్షించి ఫిజియోథెరఫీ చేయించారు. విద్యార్థులు ప్రతి రోజూ ఇంటి వద్ద వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఇం దులో ఎల్ఈఆర్‌పీ శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



చంద్రయాన్-3 వీడియోను చూస్తున్న విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాప న్నపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు . సైన్స్ ఉపా ధ్యాయులు విద్యార్థులకు చంద్రయాన్ గురించి అవగాహన కల్పించారు, అలాగే.. అంతరిక్ష పరిశో ధనలో భాగంగా భారతదేశం సాధించిన ప్రగతిని స్క్రీన్‌ల ద్వారా వివరించారు, అనంతరం విద్యా ర్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమం నిర్వహణ తీరును పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయులు ప్రవీణ్ కుమార్, యాదయ్య, వేణుగో పాల్ రెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

టెక్నాలజీ వైపు మొగ్గు చూపాలి

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ్ విద్యాసంస్థలలో శుక్రవారం జాతీయ అంత రిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా సిద్ధార్థ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రీని వాస్ చౌదరి మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయ వంతమైన ఆగస్టు 23వ తేదీని పురస్కరించుకొని జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులందరూ సైన్స్ అండ్ టెక్నాలజీ వైపు మొగ్గు చూపాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ కే.సంధ్యారాణి మాట్లాడుతూ ఖగోళంలో జరిగే అంతరిక్ష మార్పులను గమనిస్తూ, సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు సెమినార్, చంద్రయాన్ 3 నమూనాల ప్రదర్శన నిర్వహించారు.

నార్సింగిలో..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేం ద్రంలోని జెడ్పీపాఠశాలలో జాతీయ అంతరక్ష దినో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థు లకు చంద్రయాన్-3 మిషన్ సంబంధించిన వీడియో ప్రదర్శన చూపించారు. విద్యార్థులకు క్విజ్, వకృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమం లో ఇన్‌చార్జి హెచ్ఎం పూర్ణచందర్‌రావు, ఎంఎన్ఓ రామకృష్ణ, సైన్స్ ఉపాధ్యాయులు దీపా, లత, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్, ఆర్థిక నేరాలపై అవగాహన తప్పనిసరి

నర్సాపూర్ రూరల్: సైబర్, ఆర్థిక నేరాలపై ప్రతీ విద్యార్థికి అవగాహన అవసరమని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామో దర్, ఎస్‌బీఐ రిసోర్స్ పర్సన్ వినోద్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పెద్ద చింతకుంట)లో ఎస్‌బీఐ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సైబర్ ఆర్థిక నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో ఆర్థిక వికాసం పొందాలంటే సైబర్ నేరాలపై లోతుగా తెలుసుకొని అధ్యయనం చేయాలన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెం టనే 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ, రిసోర్స్ పర్సన్ బషీర్ షాబాజ్, వైస్ ప్రిన్సిపాల్ సమీరా, లెక్చర్లు డాక్టర్ సురేష్ కుమార్, కె.రమేశ్, శ్రీనివాస్, సౌజన్య, రుక్మిణి దేవి, ఖజా ఆరిఫ్, అనిత తదిత రులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): రుణమాఫీ పథకంపై బీఆర్ ఎస్ నాయకులు తప్పుడు ప్రకటనలు చేస్తు న్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి విమర్శిం చారు. అర్హులందరికి రుణమాఫీ వర్తింపచేయా లంటూ మండల కేంద్రం వెల్దుర్తిలో చేపట్టిన ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తప్ప ఒక్క రైతుకూడా లేరన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికి దశలవారీగా రూ.2ల క్షల రుణమాఫీ అమలు చేస్తుంటే, రైతులను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి పనులకు సహకరించాల్సిందిపోయి విమర్శిం చడం తగదన్నారు. సమావేశంలో సుధాకర్‌గౌడ్, మల్లేశం, నంబూద్రి, మల్లేశం, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో డ్రై డే

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్‌లో పీహెచ్‌సీ వైద్య బృందం, ఎంపీఓ లక్ష్మీనర్సయ్యల ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధులలో నీరు నిల్వ ఉన్న ప్రదే శాలను గుర్తించి పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. దోమల నివారణ, గడ్డి మందును పిచికారీ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పం చాయతీ కార్యదర్శి రూపాగౌడ్, ఏఎఎన్ఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

కారు టైర్లు ఎత్తుకెళ్లిన దుండగులు



నిజాంపేటలో కారు టైర్లను ఎత్తుకెళ్లిన దృశ్యం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రం లో శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు మూడు కార్లకు చెందిన టైర్లను ఎత్తుకె ళ్లారు. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన చెరి వ్రాల సురేష్‌కు చెందిన కారుకు సంబంధించిన నాలుగు టైర్లు, పంజా మహేందర్‌కు చెందిన కారు మూడు టైర్లు, గడ్డం రాజు చెందిన కారు 1 టైరు దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలం లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

నస్కల్ పాఠశాలలో బ్లాక్‌డే



నస్కల్‌లోని పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నిజాంపేట(మెదక్): జీవో 28 అమలైన ఆగస్టు 23న బ్లాక్ డే నిర్వహించినట్లు ఉపాధ్యాయ సం ఘాలు తెలిపాయి. శుక్రవారం మండల పరిధిలోని నస్కల్ పాఠశాలలో విరామం సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమం లో టీఎస్ సీపీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బోరుమోటార్ ప్రారంభం**

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరి ధిలోని మంభోజిపల్లిలో ఎమ్మెల్యే రోహిత్ సహకా రంతో ఏర్పాటు చేసిన బోరుమోటారును కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మంభోజిపల్లి గ్రామ ఇందిరానగర్ కాలనీలో నీటి ఎద్దడి ఉన్న విషయా న్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందిం చారు. కార్యక్రమంలో స్పందించి బోరువేయించి మోటార్ బిగించారు. కాంగ్రెస్ నాయకులు ఆంజ నేయులు, సాయాగౌడ్, యూసుఫ్, శ్రీశైలం, నర్సిం లు, మహేశ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **స్టేషన్‌లో మరుగుదొడ్డికి తాళం**

రామాయంపేట(మెదక్): రామాయంపేట మం డలం అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి ఎల్లవేళలా తాళం వేసే ఉంటుంది. దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన రైల్వేస్టే షన్లలో ఆ శాఖ రెండేళ్ల క్రితం మరుగుదొడ్లు ఏర్పాటు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ అక్కన్నపేట స్టేషనలో దీనిని ఏర్పాటు చేసి తాళం వేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తాళం తీయ లేదు. దీంతో వికలాంగులు ఇబ్బందుల పాలవుతు న్నారు. ఈ విషయమై ఆ శాఖ అధికారులను సంప్ర దించగా, మరుగుదొడ్డి తాళాలు స్టేషన్‌లో ఉన్నాయ ని, ఎవరైనా అడిగితే తాళాలు ఇస్తామని చెప్పడం గమనార్హం.

◆ **కోమటిపల్లిని పంచాయతీగా ఏర్పాటు చేయాలి**

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సి పాలిటీ పరిధిలో ఉన్న కోమటిపల్లిని ప్రత్యేక పంచా యతీగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు స్థానిక తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో కోమటిపల్లిని చేర్చడంతో తాము అన్ని విధాలుగా నష్టపోయామని పేర్కొన్నారు. తాము ఉపాధి పను లకు దూరమయ్యామని, గ్రామంలో ఎలాంటి అబి వృద్ధి పనులు జరగలేదన్నారు. మున్సిపాలిటీగా ఏర్పాటై ఆరేళ్లు గడుస్తున్నా ఒక్క పనికూడా చేపట్ట లేదన్నారు. కోమటిపల్లితోపాటు తండా, వడ్డెర కాలనీ కలుపుకొని ప్రత్యేకంగా పంచాయతీ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

◆ **మైనంపల్లి పరామర్శ**

రామాయంపేట(మెదక్): అనారోగ్యంతో మృతి చెం దిన స్థానిక ఉపాధ్యాయుడు ఐరేని రవీందర్‌గౌడ్ కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. మృ తదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, ఇతర నాయకులు మైనంపల్లి వెంట ఉన్నారు.

◆ **అవంచలో ఉచిత వైద్య శిబిరం**

నర్సాపూర్ రూరల్: మండలంలోని అవంచలో శుక్రవారం సంగారెడ్డికి చెందిన వెల్ నెస్ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, డాక్టర్లు కరుణ, కొం డి మల్లేశ్, బాలయ్య, బాలరాజు, పాల్గొన్నారు.

◆ **పరిసరాల పరిశుభ్రతపై అవగాహన**

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్, హవేళిఘణా పూర్ మండలాల్లో పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రజలు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

◆ **పారిశుధ్యంపై అవగాహన**

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సి పాలిటీ పరిధిలో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది పలు వార్డుల్లో నిలువ ఉంచిన నీటిని తొల గించారు. స్థానికులకు అవగాహన కల్పించారు. ఇం టి ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగించాలని, మురుగు నీరు నిలువ ఉండకుండా చూడాలని సూచించారు.

◆ **30, 31న ఎస్‌జీఎఫ్ క్రీడలు**

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్న పేటలో ఈనెల 30, 31వ తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు పాఠ శాల ఫిజికల్ డైరెక్టర్ రమేష్ వెల్లడించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి నీలకంఠం, హెచ్ఎం మహేశ్వర్ హాజరవుతారని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని, 30న బాలికలకు, 31న బాలురకు క్రీడలు జరుగు తాయని తెలిపారు. వీటిలో 17 సంవత్సరాల లోపు బాలబాలికలు పాల్గొనడానికి అవకాశం ఉందని, మిగతా వివరాలకు 8985536704, 9010735121 నంబర్లలో సంప్రదించాలని కోరారు.